## సెప్టెంబర్‌లో తగ్గిన బొగ్గు ఉత్పత్తి

- ఆందోళనలో యాజమాన్యం

గోదావరిఖని, సెప్టెంబర్ 10: సింగరేణి సంస్థలో గతంలో ఎప్పుడు లేనివిధంగా సెప్టెంబర్‌లో భారీగా బొగ్గు ఉత్పత్తి తగ్గుతుండడంతో యాజమాన్యం ఆందోళనలో పడింది. సెప్టెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు 55శాతం బొగ్గు ఉత్పత్తి జరిగింది. రానున్న రోజుల్లో ఉత్పత్తి పెంచేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. రోజుకు రెండు లక్షల టన్నుల ఉత్పత్తి చేయాలని సంస్థ చైర్మన్ సీఎండీ బలరాం అధికారులను ఆదేశిస్తుంటే ఆ స్థాయిలో ఉత్పత్తి జరగడం లేదు. సోమవారం అత్యల్పంగా సింగరేణిలో 11,4,311 టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఈ నెల 1 నుంచి 9వ వరకు 14,63,004 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను కేవలం 80,8,208 టన్నుల(55శాతం) జరిగింది. వర్షాల కారాణాంగా ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. సెప్టెంబర్‌తో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలల కాలం ముగుస్తుండడంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. 72 మిలియన్ టన్నుల భారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యసాధనతో ముందుకు సాగుతున్న సింగరేణికి రానున్న రోజుల్లో ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సింగరేణి సంస్థకు సంబంధించి ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి త్వరలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశాలు కనిస్తుండడతో అధికారులు కొంత ధీమా వ్యక్తమవుతున్నది. రానున్న రోజుల్లో రోజువారి బొగ్గు ఉత్పత్తి పెరగకుంటే ఇబ్బందులు తప్పవని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

### సమస్యల పరిష్కారమే ధ్యేయం

గోదావరిఖని, సెప్టెంబర్10: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ సెల్ ద్వారా కృషిచేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కార్మికుల కుటుంబాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి మీట్ యువర్ జీఎం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, అధికారులు ఉన్నారు.

### అడ్రియాల గనిలో కార్మికునికి విద్యుత్ షాక్

రామగిరి, సెప్టెంబర్ 10: ఏపీఏ ఏరియాలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో మంగళవారం మొదటి షిఫ్టులో జరిగిన ప్రమాదంలో కోల్ కట్టర్ కుంట రాజేందర్ కు విద్యుత్ షాక్ తగిలింది. గనిలో మూడో సీమ్‌లో డ్రిల్లింగ్ వేస్తుండగా మిషన్ నుంచి విద్యుత్ సరఫరా అయి షాక్ తగిలింది. దీంతో అస్వస్థతకు గురి కాగా వెంటనే సెంటినరీకాలనీ డిస్పెన్సరీకి తరలించారు. ప్రథమ చికిత్స చేసి గోదావరిఖని దవాఖానకు తరలించారు. ఉత్పత్తి లక్ష్యంగా అధికారులు కార్మికులపై పని ఒత్తిడికి గురి చేస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ ప్రమాదంపై డీజీఎంఎస్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## రామగుండం అభివృద్ధిపై ఏదీ దృష్టి

- గత ప్రభుత్వం నిధులతోనే పనులు
- 10 నెలల తర్వాత కౌన్సిల్ సమావేశం
- 15 ఎజెండాలు... బడ్జెట్ ఊసే లేదు

కోల్‌సిటీ, సెప్టెంబర్ 10: రామగుండం నగర పాలక సంస్థ అభివృద్ధిపై పాలక వర్గం దృష్టి సారించడం లేదు. జిల్లాలోనే ఏకైక కార్పొరేషన్‌గా ఉన్న రామగుండంలో అభివృద్ధికి ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నగర పాలక సంస్థ ప్రతిపాదించిన పనులకు టీయూఎఫ్ఐడీసీ ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు ఆ నిధులతోనే సర్దుబాటు చేసుకుంటూ వస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో దాదాపు 10 నెలల తర్వాత కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు నిర్ణయించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో 15వ సాధారణ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నారు. కేవలం 15 ఎజెండాల ఆమోదానికి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తుండగా, అందులో బల్దియా అభివృద్ధికి బడ్జెట్ రూపకల్పనలో ప్రాధాన్యత లేకపోవడం నీరుగారుస్తున్నది. గత ప్రభుత్వం ప్రతిపాదనలతో మంజూరైన నిధులు తప్పితే కొత్తగా అభివృద్ధి పనుల కోసం బడ్జెట్ కేటాయింపునకు ఎలాంటి ఎజెండాను పొందుపర్చకపోవడం విస్మయానికి గురి చేస్తున్నది. ఎజెండా అంశాలను బట్టి చూస్తే చెప్పుకోదగ్గగా లేదని కార్పొరేటర్లు బాహాటంగా చర్చించుకుంటున్నారు. నగరంలోని సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకవద్దామని చాలా కాలంగా కార్పొరేటర్లు పట్టుబడుతూ వస్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది. కేవలం పారిశుధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, టీయూఎఫ్ఐడీసీ కింద 2022లో మంజూరైన నిధులకు సంబంధించి బిల్లుల మంజూరుకు మాత్రమే కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలు ప్రవేశపెట్టడంపై కార్పొరేటర్లు కూడా అసంతృప్తితోనే ఉన్నారు.

### 10మంది సీఐల బదిలీలు

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 10: మల్టీజోన్ -1 పరిధిలో 10మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ ఐజీపీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సీఐలు డీ రాజనర్సయ్యను వీఆర్ రామగుండంకు ఎక్సిటింగ్ వెకెన్సీగా, కే రవీందర్‌ను గోదావరిఖని వన్‌టౌన్ 2 సీఐగా, ఎన్ వెంకటేశ్వర్లును సీసీఎస్ జెస్ భూపాలపల్లి ఎక్సిటింగ్ వెకెన్సీగా, సీహెచ్ రాజిరెడ్డిని సీఎస్‌బీ ఖమ్మం ఎక్సిటింగ్ వెకెన్సీగా, సీటీసీ కరీంనగర్‌కు అటాచ్ సీఐ డీ కమలాకర్‌ను సీసీఎస్ 3 రామగుండం ఎక్సిటింగ్‌గా బదిలీ చేశారు.

### మాజీ ఎమ్మెల్యేల విగ్రహాల ఏర్పాటుపై హర్షం

కోల్‌సిటీ, సెప్టెంబర్ 10: గోదావరిఖనిలో మాజీ మంత్రి మాతంగి నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే మాలెం మల్లేశంల విగ్రహాలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ప్రకటించడంపై దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రకటనను స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. నాయకులు దాసరి ఎల్లయ్య, కోటేశ్వరరావు, కనుకుంట్ల రమేశ్, దేవి లచ్చయ్య, వడ్డూరు శ్రీనివాస్, పర్వతాలు, ధర్మేందర్ ఉన్నారు.

### శ్వేతపత్రం విడుదల చేయండి

కోల్‌సిటీ, సెప్టెంబర్ 10: రామగుండం కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుల గ్రూప్ సొసైటీ నిధులపై శ్వేత పత్రం విడుదల చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని ఫైట్‌ఫర్ బెడర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్, ఏఐటీయూసీ నాయకుడు ఎంఏ గౌస్ కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీకి మంగళవారం వినతి పత్రం అందజేశారు.

### రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

రామగిరి, సెప్టెంబర్ 10: కల్వచర్లలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులలు హరిశ్చంద్రప్రసాద్, డీ.కార్తికేయ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 1న జరిగిన జిల్లా స్థాయి జూనియర్ ఇంటర్ బేస్ బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 14 నుంచి 16 వరకు నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం శోభన్‌రావు తెలిపారు. విద్యార్థులను అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బోనగాని హారిక, పీడీ సతీశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఉత్సవ కమిటీ ఎన్నిక

కోల్‌సిటీ, సెప్టెంబర్ 10: గోదావరిఖనిలోని మార్కండేయ శివాలయ ఉత్సవ కమిటీని శివాలయం శాశ్వత సంక్షేమ ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోరండ్ల ఆనందం, మంచికట్ల వెంకటస్వామి మంగళవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా మంచికట్ల భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా రాజమల్లు, కోశాధికారిగా గడ్డం రవిగౌడ్, ముఖ్య సలహాదారులుగా గుండ రాజు, కొండి లక్ష్మీపతి నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కానుగంటి నారాయణ, కుంట రామన్న, తాటిపాముల రాజేశ్, గుండేటి సతీశ్, లెక్కల రాజిరెడ్డి, తోకల మల్లయ్య, బత్తుల నారాయణ, బోయిన కొమురయ్య, ఎల్లయ్య, రాజేందర్, సాంబమూర్తి, రవీందర్, సతీశ్, వేణులను ఎన్నుకున్నారు.

### కొలనూర్‌లో ఫాగింగ్

ఓదెల, సెప్టెంబర్ 10: దోమల నివారణకు కొలనూర్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం రాత్రి ఫాగింగ్ చేశారు. స్పెషల్ ఆఫీసర్ సునీత, కార్యదర్శి శ్రీనివాస్ పారిశుధ్య పనులు చేయించారు.

## భర్త రెండో పెండ్లి..

- ఆస్తి కోసం మొదటి భార్య, కూతురు బైఠాయింపు
- న్యాయం చేయాలని డిమాండ్

ఓదెల, సెప్టెంబర్ 10: భర్త రెండో పెండ్లి చేసుకోగా, ఆస్తి కోసం అతని ఇంటి ఎదుట మొదటి భార్య, కూతురు బైఠాయించి నిరసన తెలిపిన ఘటన ఓదెల మండలం కొలనూర్‌లో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలనూర్‌కు చెందిన జంగ సంజీవరెడ్డి-వనజ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఆడపిల్లలు కావడంతో పాటు తరచూ భార్య, భర్తలు మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో కొన్నేండ్ల క్రితం వనజ తన ఇద్దరు కూతుళ్లను తీసుకుని కరీంనగర్ జిల్లా చల్లూరులోని పుట్టింటికి వెళ్లింది. 12 ఏండ్లుగా అక్కడే ఉంటోంది. ఇద్దరు కూతుళ్లను కష్టపడి పెంచింది. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నారు. అయితే సంజీవరెడ్డి కొన్నేళ్ల క్రితం రెండో వివాహం చేసుకోగా, విషయం తెలిసి తల్లీకూతుళ్లు న్యాయం కోసం పోరుబాటపట్టారు. మొదటి భార్యగా తనకు, తనపిల్లలకు ఆస్తిలో వాటా కావాలని కొద్దిరోజులుగా నిరసన ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి నుంచి సంజీవరెడ్డి ఇంటి ఎదుట తల్లి, ఒక కూతురు బైఠాయించగా, భర్త ఇం టికి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. తమకు న్యాయం చేయాలని, నా కూతుళ్లకు దారి చూపాలని వనజ వేడుకుంటుండగా, స్థానిక మహిళలు సంఘీభావం తెలిపి వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

### పీసీసీ అధ్యక్షుడికి సన్మానం

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్10: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన బి. మహేశ్ కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మంగళవారం కలిశారు. ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అంతటి అన్నయ్య గౌడ్ ఉన్నారు.

### రాష్ట్ర కార్యదర్శిగా సదాశివ్

ఓదెల, సెప్టెంబర్ 10: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా కనగర్తి గ్రామానికి చెందిన కందుల సదాశివ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తన నియమకానికి సహకరించిన నాయకులకు సదాశివ్ కృతజ్ఞతలు తెలిపారు. స్వరాష్ట్రం కోసం ఉద్యమించిన వారి సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటుకు తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలు నెరవేర్చాలని కోరారు.

### శిక్షణ పొందిన అభ్యర్థులకు పోస్టింగ్ ఉత్తర్వులు

రామగిరి, సెప్టెంబర్ 10: సింగరేణి ఏపీఏ ఏరియా ఎంవీటీసీలో 48 రోజుల శిక్షణ పూర్తయిన డిపెండెంట్లకు జీఎం కార్యాలయంలో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు మంగళవారం పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, రహన్ షరీఫ్ ఉన్నారు.

### మహిళా శక్తి క్యాంటీన్‌కు షటర్ల అప్పగింత

ధర్మారం, సెప్టెంబర్ 10 : మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలోని షటర్లను అధికారులు అప్పగిం చారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు ధర్మారంలో పంచాయతీ రాజ్ అతిథి గృహం ఆవరణలో నిర్మించిన దుకాణ సముదాయం నుంచి రెండు షటర్లను మారుతి గ్రామైక్య సంఘానికి అప్పగిస్తూ ఉత్తర్వుల కాపీని మండల ప్రత్యేకాధికారి బీ రాజేందర్ అందజేశారు. ఇక్కడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీఆర్డీవో ఆర్ రవీందర్, పీఆర్ డీఈ రాజమౌళి, పీఆర్ ఏఈ రాజశేఖర్, ఏపీవో రవి, సెర్ప్ ఏపీఎం తులసీమాత, మారుతి గ్రామైక్య సంఘం సభ్యులు ఉన్నారు.

### 'మురళీధరీయం' పుస్తకావిష్కరణ

ఫర్టిలైజర్‌సిటీ, సెప్టెంబర్ 10: గౌతమినగర్ హనుమాన్ దేవాలయంలో వేదబ్రహ్మణుడు రాంపల్లి మురళీధర్ శర్మ రచించిన మురళీధరీయం పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. మురళీధర్ శర్మ దంపతులను ప్రముఖ కవి మాడిశెట్టి గోపాల్ సన్మానించారు. ఇక్కడ ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప దేవాలయ గురుస్వాములు భద్రయ్య, ప్రభాకర్, లక్ష్మీనారాయణ, రాములు, తదితరులు ఉన్నారు.

### ఆర్అండ్ బీ, ఫారెస్టు అధికారులపై ఫిర్యాదు

రామగిరి, సెప్టెంబర్ 10: ఆర్ అండ్ బీ, అటవీ శాఖ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. కల్వచర్ల నుంచి లద్నాపూర్ వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంలో రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగిస్తున్నారని పేర్కొన్నారు. చెట్లను నరికి విలువైన కర్రను అక్రమంగా తరలిస్తున్నా ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెట్ల నుంచి కర్ర తీసుకెళ్తూ వాటి నుంచి వచ్చిన కొమ్మలు, చెత్త చెదారం రోడ్లపైన పడేస్తున్నారని పేర్కొన్నారు. దీనితో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, మేరుగు శ్రీకాంత్, కందుల రమేశ్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్10: మండల కేంద్రానికి చెందిన మెట్టు సమ్మక్క ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్, మాజీ ఎంపీటీసీ జనగామ రవి మంగళవారం పరామర్శించారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

### పేకాట శిబిరంపై దాడి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబర్10: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. రూ. 5030, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాడుతూ పట్టుబడిన ఆరుగురిని ఠాణాకు తరలించారు.



## తొలి ప్రైవేట్ స్పేస్‌వాక్

**నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన 'స్పేస్ ఎక్స్'**

కేప్ కెనావెరల్, సెప్టెంబర్ 10: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఖగోళ పరిశోధనా సంస్థ 'స్పేస్ ఎక్స్' సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్ నిర్వహించేందుకు 'పొలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను 'ఫాల్కన్-9' రాకెట్ ద్వారా రోదసిలోకి పంపింది. ప్రముఖ బిలియనీర్ జేర్డ్ ఇసాక్‌మన్, 'స్పేస్ ఎక్స్' ఇంజినీర్లు సారా గిల్లీ, అన్నా మెనోన్, అమెరికా వైమానికదళ మాజీ పైలట్ స్కాట్ కిడ్‌తో కూడిన ఈ రాకెట్ మంగళవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 'పొలారిస్' ప్రాజెక్టులో చేపట్టే మూడు మానవసహిత రోదసి యాత్రల్లో ఇదే మొదటిది. ఈ యాత్ర అనుకున్నట్టుగా సాగితే బుధవారం లేదా గురువారం వారు స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

## మహారాష్ట్రలో ఎన్నికల వేడి

- దీపావళి తర్వాత ఎన్నికలకు అవకాశం
- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం
- మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ
- రెండు కూటముల మధ్య హోరాహోరీ
- తేలనున్న శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు
- సర్వేల్లో మహా వికాస్ అఘాడీకి మొగ్గు



ముంబై, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల హీట్ మొదలైంది. దీపావళి తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 13న జిల్లాల కలెక్టర్లతో ఈసీ సమీక్ష నిర్వహించనుంది. కాగా, అధికారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్)తో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల బరిలో దిగుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌ను కొనసాగించి రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ ప్రయత్నిస్తున్నది. దీంతో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారం ఎవరిదో నిర్ణయించడంతో పాటు శివసేన, ఎన్సీపీల భవిష్యత్తును కూడా తేల్చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కూటములకు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

### ఏ ప్రాంతంలో ఎవరిది హవా?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే సర్వేల జోరు మొదలయ్యింది. అయితే, పలు ప్రాంతాల్లో మహాయుతి, ఇంకొన్ని ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి. విదర్భలోని 62 సీట్లలో మహా వికాస్ అఘాడీ అధిపత్యం ఉంటుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఖాందేశ్‌లోని 47 సీట్లలో రెండు కూటములకు సమానంగా విజయావకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కంచుకోట అయిన థాణేతో పాటు కొంకణ్ బెల్ట్‌లోని 39 సీట్లలో మాత్రం మహాయుతి కూటమికి మొగ్గు కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. థాణేలో షిండే వైపు నిలుస్తున్న మరాఠా ఓటర్లు ముంబైలో మాత్రం ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా ఉన్నారని, ముంబై బెల్ట్‌లోని 36 నియోజకవర్గాల్లో మహాయుతిపై మహా వికాస్ అఘాడీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవార్ కుటుంబానికి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లతో పాటు, మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు చెప్తున్నారు. మహాయుతి కంటే మహా వికాస్ అఘాడీకే రాష్ట్రంలో మొగ్గు కనిపిస్తున్నదని లోక్ పోల్ సర్వే పేర్కొన్నది.

### లోక్‌సభ ఫలితాలు రిపీట్ అవుతాయా?

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 17 సీట్లతో సరిపెట్టుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత, శాంతిభద్రతలు దెబ్బతినడం, అధిక ధరలు, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడం, మరాఠాల రిజర్వేషన్ల ఉద్యమం, నిరుద్యోగం, మహారాష్ట్ర నుంచి పలు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోవడం వంటి అంశాలు మహాయుతి కూటమికి వ్యతిరేకంగా మారాయి. మరోవైపు మూడు పార్టీల మధ్య సమన్వయలేమి, సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి అంశాలు మహా వికాస్ అఘాడీకి ప్రతికూలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



**కేదార్‌నాథ్ మార్గంలో విరిగిన కొండచరియలు**

## ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేదార్‌నాథ్ వెళ్లే మార్గంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడగా, ఐదుగురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై సోన్‌ప్రయాగ, గౌరీకుండ్ మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు అక్కడికి చేరుకొని, ఘటనాస్థలం నుంచి ఐదు మృతదేహాల్ని వెలికితీసినట్టు రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వార్ చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది యాత్రికులు చిక్కుకుపోయి ఉండొచ్చునని పోలీసులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో వైష్ణో దేవి ఆలయాన్ని చేరుకునేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడి ఇద్దరు మహిళా యాత్రికులు చనిపోయారు.

### 5 వేల సైబర్ కమెండోలు.. ఆన్‌లైన్ రిజిస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సైబర్ భద్రతను మరింత పటిష్ఠం చేయడం కోసం కేంద్రం కీలక చర్యలు ప్రకటించింది. 5 వేల మంది సైబర్ కమెండోల నియామకం, వెబ్ ఆధారిత డాటా రిజిస్ట్రీ, సైబర్ నేరాల సమచారం పంచుకొనే పోర్టల్, జాతీయ అనుమానితుల రిజిస్ట్రీని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలకు హద్దులు లేవని.. సైబర్ భద్రత లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన భారత సైబర్ నేరాల సహకార కేంద్రం(ఐ4సి) మొదటి వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత సంస్థల ప్రతినిధులతో సైబర్ నేరాల తగ్గింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

### మహిళా అధికారిపై వింగ్ కమాండర్ లైంగిక దాడి!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- విచారణకు ఆదేశించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: భారత వైమానిక దళంలోని ఉన్నత అధికారిపై అత్యాచారం ఆరోపణలు జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించాయి. జమ్ముకశ్మీర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వింగ్ కమాండర్ తనపై లైంగిక దాడి చేయడమే కాక, మానసికంగా వేధిస్తున్నాడని మహిళా ఫ్లయింగ్ అధికారి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఐఏఎఫ్ అంతర్గత విచారణకు ఆదేశించింది. జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం పోలీసు స్టేషన్‌లో వింగ్ కమాండర్‌పై కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం ఈ ఘటన 2023, డిసెంబర్ 31న న్యూఇయర్ వేడుకల్లో జరిగింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన పార్టీలో ఆ అధికారి తన గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు.


## తోడేళ్ల భరతం పడుతున్నారు



*ఉత్తర ప్రదేశ్‌లోని భరూచ్‌లో మనుషుల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్ల వేట కొనసాగుతున్నది. అటవీ శాఖ అధికారులు స్థానికుల సహాయంతో మంగళవారం వలపన్ని ఒక తోడేలును ఇలా బంధించారు. మిగతా వాటి కోసం వేట కొనసాగుతోంది.*

## సుప్రీం ఆదేశాలను ధిక్కరించి..!

- నిరసనలు కొనసాగిస్తున్న కోల్‌కతా జూనియర్ డాక్టర్లు
- చర్చలకు రావాలంటూ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానం



కోల్‌కతాలో స్వాస్థ్య భవన్ వైపు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా, సెప్టెంబర్ 10: కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖాన హత్యాచార ఘటనపై నిరసన చేపడుతున్న జూనియర్ డాక్టర్లు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించారు. మంగళవారం ఐదు గంటల్లోపు విధుల్లోకి చేరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ ఆందోళన కొనసాగించారు. 32వ రోజైన మంగళవారం కూడా విధులు బహిష్కరించి తమ నిరసనను కొనసాగించారు. మరోవైపు, సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి చర్చలకు రావాల్సిందిగా జూనియర్ డాక్టర్లను బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆహ్వానించారు. దీనిని జూనియర్ డాక్టర్లు తిరస్కరించారు.

### నాలుగేండ్లు ఏం చేశారు?

మలయాళ సినీ పరిశ్రమలో మహిళల వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై ఎలాంటి చర్య తీసుకోకుండా స్తబ్దుగా, నిష్క్రియాత్మకంగా ఉండటం పట్ల కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు తప్పుబట్టింది. నివేదిక ఇచ్చిన నాలుగేండ్ల తర్వాత మాత్రమే చర్యలు ప్రారంభించిందని, ఇన్నాళ్లూ ప్రభుత్వం ఏం చేసిందనిజస్టిస్‌లు ఏకే జయశంకరన్ నంబియార్, సీఎస్ సుధాలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. వెంటనే కమిటీ పూర్తి నివేదికను (సిట్)కు అప్పగించాలని ఆదేశించింది

### హేమ కమిటీతో ఆదర్శం: పినరయి

దేశంలోని ఏ రాష్ట్రం చేయని విధంగా చలన చిత్ర పరిశ్రమపై వచ్చిన ఆరోపణలపై తమ ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని వేసి ఆదర్శంగా నిలిచిందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు.

### 'సిద్ధ' ఔషధాలతో బాలికల్లో రక్తహీనత తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కొన్ని 'సిద్ధ' ఔషధాల కాంబినేషన్‌తో కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్‌లో ఇది ప్రచురితమైంది. కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన ప్రకారం.. ఏబీఎంఎన్(అన్నపెటిక్‌సెంచురమ్, బావన కటుక్కాయ్, మతులై మనప్పుకు, నెల్లికాయ్ లేహ్యం) మిశ్రమంతో కూడిన సిద్ధ ఔషధం హిమోగ్లోబిన్ స్థాయిలను, రక్త కణాల శాతాన్ని పెంచుతుందని కనుగొన్నారు. శరీరంలో నులి పురుగులు తొలగించిన 2300 కిశోర బాలికలపై 45 రోజులపాటు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ బాలికల్లో రక్త హీనత లక్షణాలైన అయాసం, జుట్టు ఊడిపోవడం, తలనొప్పి, రుతుక్రమ అసమతుల్యత తగ్గినట్టు కనుగొన్నారు. జాతీయ సిద్ధ సంస్థ, తమిళనాడులోని గ్జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, వెలుమైలు సిద్ధ వైద్య కళాశాల, దవాఖాన తదితర సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.

**సమాన అవకాశాలు ఉంటే**

## రిజర్వేషన్లు రద్దు

**లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్య**

వాషింగ్టన్, సెప్టెంబర్ 10: అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని, ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం దాదాపు శూన్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనారిటీ మాత్రమే ఉన్నారని అన్నారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

### రాహుల్ వ్యాఖ్యలపై వివాదం

వర్జీనియాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. 'ఇవాళ భారత్‌లో పోరాటం రాజకీయాల కోసం కాదు. ఒక సిక్కు టర్బన్ ధరించి, గురుద్వారాకు వెళ్లడానికి అనుమతిస్తారా అనే దానిపై పోరాటం జరుగుతున్నది. అన్ని మతాల కోసం జరుగుతున్న పోరాటం ఇది' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురి తప్పుబట్టారు. రాహుల్ మాట్లాడిన భాష ఖలిస్థానీ వేర్పాటువాది గురుత్వంత్ సింగ్ పన్నూ భాషను పోలి ఉందని ఆయన ఆరోపించారు.

### ఇజ్రాయెల్ దాడిలో 19 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్, సెప్టెంబర్ 10: గాజాలోని ఓ రక్షణ గుడారంపై మంగళవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కనీసం 19 మంది చనిపోయారని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అయితే ఆ గుడారంలో తల దాచుకున్న హమాస్ ఉగ్రవాదులను ఏరివేయడం కోసమే గురి చూసి ఆయుధాలతో దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. మృతుల సంఖ్యపై విభేదించింది. ఇజ్రాయెల్ ప్రకటనను హమాస్ ఖండించింది.

### రష్యాకు ఇరాన్ ఆయుధాలు!

లండన్: రష్యాకు ఇరాన్ ఆయుధాలు సరఫరా చేస్తున్నదని అమెరికా, బ్రిటన్ మంగళవారం ఆరోపించాయి. ఉక్రెయిన్‌పై దాడికి ఉపయోగపడేలా ఇరాన్ స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను రష్యాకు పంపుతున్నదని పేర్కొన్నాయి. ఈ సందర్భంగా తమ దౌత్యవేత్తల కీవ్ ఉమ్మడి సందర్శనకు ముందు మాస్కో, టెహ్రాన్‌పై ఆంక్షలు విధిస్తున్నట్టు ప్రకటించాయి. లండన్‌ను సందర్శించిన అమెరికా కార్యదర్శి ఆంటోని బ్లింకెన్ బ్రిటిష్ విదేశీ కార్యదర్శితో మాట్లాడుతూ ఇలా ఆయుధాలు సరఫరా చేయడం వల్ల సంక్షోభం మరింత తీవ్రతరం అవుతుందని హెచ్చరించినా ఇరాన్ లెక్కచేయలేదని అన్నారు.